# పారిశుధ్యంపై పట్టింపేది?

- శానిటరీ సూపర్‌వైజర్ లేకపోవడంతో ఐదు డివిజన్లలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- పట్టించుకోని అధికారులు
- అసహనం వ్యక్తం చేస్తున్న స్థానికులు


మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

**జ్యోతినగర్:** రామగుండం కార్పొరేషన్ ఎన్టీపీసీ ప్రాంతంలో శానిటరీ సూపర్‌వైజర్ లేకపోవడంతో 2, 3, 4, 23, 24వ డివిజన్లలో పారిశుధ్య పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆటోనగర్‌లోని మురుగు కాలువ పూర్తిగా చెత్త నిండి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. అన్నపూర్ణకాలనీ, కృష్ణానగర్‌లోని పలు వీధుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వారంరోజుల క్రితం ఈ ప్రాంతంలో విధులు నిర్వహించే శానిటరీ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవడం, కొత్త వారిని నియమించకపోవడంతో పారిశుధ్య వ్యవస్థ అధ్వానంగా మారింది. డివిజన్లలో ఉన్న సమస్యలను సూపర్‌వైజర్‌కు సమాచారం ఇస్తే చర్యలు తీసుకునేవారు. కానీ సమాచారం ఇస్తామన్న కూడా ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఎవరికి సమస్య తెలియజేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది సైతం వారికి పనులు అప్పగించే వారు లేకపోవడంతో ఎక్కడ విధులు నిర్వహించాలో తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు ఎన్టీపీసీ ఏరియాలోని ఐదు డివిజన్లకు పారిశుధ్య విభాగం సూపర్‌వైజర్‌ను వెంటనే నియమించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

### దుర్వాసన వస్తోంది



ఆటోనగర్‌లోని పెద్ద కాలువ చెత్తతో నిండిపోయింది. కాలువలో చెత్త వేయడంతో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. శానిటరీ సూపర్‌వైజర్ లేకపోవడంతో సమస్య ఎవరికి చెప్పాలో తెలియడం లేదు. కాలువల్లో మురుగునీరు ఉండి వాసన వస్తోంది. కాలువల్లో నిండిన పూడిక తీసి మురుగు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలి.

– సంపత్, ఆటోనగర్, ఎన్టీపీసీ

### చెత్త తీయడం లేదు



డివిజన్‌లో చెత్త తీసేవారు ఎక్కడ పని చేస్తున్నారో, వారికి ఎవరు పనులు చెప్తున్నారో తెలియడం లేదు. గతంలో కాలనీలోని పారిశుధ్య సమస్యను సూపర్‌వైజర్‌కు చెప్తే సిబ్బందిని పంపించి పనులు చేసేవారు. ఇప్పుడు సూపర్‌వైజర్ లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫోన్ చేస్తే వారు లిఫ్ట్ చేయరు.

– వీరాలాల్, సుభాష్‌నగర్, ఎన్టీపీసీ రామగుండం

### చర్యలు తీసుకుంటాం



ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ఐదు డివిజన్ల పారిశుధ్య విభాగానికి ఇన్‌చార్జి సూపర్‌వైజర్‌ను నియమిస్తాం. ప్రజల సమస్యలను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు తెలియజేస్తే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రజలు ఇళ్లలోని చెత్తను రోడ్డుపై, కాలువల్లో వేయకూడదు. కాలువల్లో చెత్త పారేసిన వారిని గుర్తించి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– జె.అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్

# త్రీమెన్ కమిటీ విచారణతో వడదెబ్బ మృతిగా నిర్ధారణ


డాక్టర్ ఉదయ్‌కిరణ్, మెడికల్ ఆఫీసర్

**రామగుండం:** గరిష్ఠ ఉష్ణోగ్రతలతో రాత్రివేళల్లో అస్వస్థతకు గురై మృత్యువాత పడిన వారిని వడదెబ్బ మృతిగా భావించలేమని, పీహెచ్‌సీ డాక్టర్, పోలీస్, రెవెన్యూ త్రీమెన్ కమిటీ విచారణ, మృతదేహానికి పోస్టుమార్టం ఆధారంగానే వడదెబ్బగా నిర్ధారించడం జరుగుతుందని అంతర్గాం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వడదెబ్బ మృతుల కుటుంబాలకు పరిహారం రూ.నాలుగు లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పలు అంశాలు వివరించారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10లోపు, సాయంత్రం 5తర్వాతే బయటకు వెళ్లాని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తులను ముందుగా చల్లటి ప్రదేశానికి తీసుకువచ్చి, దుస్తులను వదులుచేసి గాలి తగిలేలా చూడాలన్నారు. వెంటనే తడి గుడ్డతో ఒంటిని తుడిచి, ఓఆర్‌ఎస్ ద్రావణం, నిమ్మరసం తాగించాలని వివరించారు. ఆ తర్వాత సమీప ఆస్పత్రికి తరలించాలన్నారు

**వడదెబ్బకు గురై మరణిస్తే నిర్ధారించే అంశాలు..**

- వడదెబ్బతో మృతిచెందినట్లు భావిస్తే తొలుత మండల వైద్యాధికారి, పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలి.
- వడదెబ్బతో మృతిచెందిన కుటుంబం వద్దకు సమీప ఆశ, ఏఎన్‌ఎంలను పంపించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి మృతికి గల కారణాలను సేకరించాల్సి ఉంటుంది.
- వ్యక్తి మరణించిన రోజు 42 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రత రికార్డు అయి వడదెబ్బతో మృతిచెందినట్లు ధ్రువీకరణ జరిగితే పరిహారం అందుతుంది.
- వడదెబ్బతో మృతిచెందితే ఐదుగంటలలోగా మృతుడి నుంచి టెంపరేచర్ సేకరించే వీలుంటుంది.
- ఆ తర్వాత మృతదేహాన్ని మెడికల్ ఆఫీసర్, ఎస్సై, తహసీల్దార్ పరిశీలించి వారి సమక్షంలో పోస్టుమార్టం చేయించాల్సి ఉంటుంది.
- పోస్టుమార్టం నివేదిక ఆధారంగా వచ్చే ఫలితాన్ని బట్టి ఏ కారణంతో మృతి చెందారన్న విషయాన్ని పరిశీలించి, వడదెబ్బతో మృతిచెందితే ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు.

# ఇంటర్ బోర్డు కార్యాచరణ అమలు చేయాలి

**ధర్మారం:** ఇంటర్ బోర్డు రూపొందించిన 20రోజుల కార్యాచరణను తక్షణమే అమలు చేయాలని ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారులు వసుంధరదేవి, జిల్లా ఇంటర్ విద్యాధికారి కల్పన అధ్యాపకులకు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు అధ్యాపకులు, విద్యార్థులతో వేర్వేరుగా సమావేశం అయ్యారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల పెరుగుదల, ప్రస్తుతం జరగబోయే సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన వారు అధ్యాపకులతో చర్చించారు. ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల్లో పాసయ్యేలా చదివించాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గీతవాణి, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రత్యేక తరగతుల పరిశీలన**


సూచనలు చేస్తున్న అధికారి

**జూలపల్లి:** ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థుల కోసం చేపట్టిన వేసవి ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి వసుంధర, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి కల్పన సూచించారు. ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థుల కోసం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను శుక్రవారం వారు పర్యవేక్షించారు. ఈనెల 22 నుంచి సంప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, ఇందు కోసం సన్నద్ధం కావాలన్నారు. ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్, అధ్యాపకులు ఉన్నారు.

## క్లుప్తంగా

### కొత్తపల్లిలో చెన్నకేశ్వరుని కల్యాణం



**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అర్చకులు కృష్ణమాచారి, సత్యనారాయణ, ఉపేందర్ స్వామివారి కల్యాణం, హోయయజ్ఞం నిర్వహించారు.

### ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు


శోభాయాత్రలో భక్తులు

**మంథని:** ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు మంత్రపురిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీశీలేశ్వర, సిద్దేశ్వరస్వామి దేవాలయంలోని ఆది శంకరాచార్యుల ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదురోజులుగా స్వామివారికి నిత్య రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు శ్రీసూక్తం, భజన కార్యక్రమాలు చేపట్టారు. పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో వేద పండితులు దుద్దిళ్ల మారుతి శర్మ, ఒజ్జల గణేశ్, నల్లగొండ మదనగోపాల్, ఆలయ పూజారి దహగం రమేశ్, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

### పిచ్చిమొక్కల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


పిచ్చిమొక్కలు తొలగించిన తర్వాత

**రామగుండం:** కార్పొరేషన్ 22వ డివిజన్ పరిధిలోని రామగుండం పట్టణ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్ లోపల పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీనిపై గత నెల 28న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. రామగుండం ఎన్‌పీడీసీఎల్ ఏఈ తొటం రవీందర్ స్పందించి సిబ్బందితో పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.

### డ్రైనేజీలో చెత్త తొలగింపు



**యైటింక్లయిన్‌కాలనీ:** యైటింక్లయిన్‌కాలనీ సుందరీకరణలో భాగంగా రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాకలో డ్రైనేజీ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఎస్సీ కాలనీలోని రోడ్లపై, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. కాంగ్రెస్ కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, డివిజన్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, నరేశ్, శ్రీజ, సత్యనారాయణ పాల్గొన్నారు.

### మట్టి తరలింపుపై గ్రామస్తుల ఆందోళన



**పెద్దపల్లిరూరల్:** చెరువు నుంచి తీసిన మట్టిని డంప్ నుంచి ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులో గల మట్టి డంపు నుంచి లారీలు, టిప్పర్లతో ఎడతెరిపి లేకుండా మట్టిని తరలిస్తూ రోడ్లు, కల్వర్టు ధ్వంసం చేస్తున్నారని మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ కుమ్మరి అంజయ్య, తిరుమల్, సంజీవ్ తదితర గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న లారీలతో గ్రామంలో కొన్నిరోజుల క్రితం వేసిన బీటీ రోడ్డు, దేవునిపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలోని లోలెవల్ కాజ్‌వే ధ్వంసం అయ్యాయంటూ శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో కాకుండా మరో మార్గంలో ఉన్న మట్టి రోడ్డుపై నుంచి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

## సంక్షిప్త వార్తలు

**• రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు**

**పాలకుర్తి:** మండల పరిధిలోని గ్రామాలను కలిపే ప్రధాన రహదారిపై కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద రోడ్డు ప్రమాదాల నియంత్రణకు శుక్రవారం బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. స్థానికంగా మూలమలుపు ఉండటం, వాహనదారులు వేగంగా వచ్చి ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో ఎస్సై స్వామి రహదారికి ఇరువైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయించారు.

**• ఆయన నేత్రాలు సజీవం**

**పాలకుర్తి:** మండలంలోని జీడీనగర్‌లో శుక్రవారం అనారోగ్యంతో మరణించిన జంపాల యాదగిరి నేత్రాలను ఆయన కుటుంబసభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్, జాతీయ కార్యదర్శి మేరుగు భీష్మాచారి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్ నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఐబ్యాంక్‌కు పంపించారు.

**• ఎన్టీపీసీ పీటీఎస్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి**

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ టౌన్‌షిప్‌లో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పీటీఎస్‌లో సివిల్ పనులు నిర్వహిస్తున్న కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీకి చెందిన కోగిసర్ సునాని(48) శుక్రవారం మధ్యాహ్నం మామిడి చెట్టుపైకి ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ధన్వంతరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రి వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించడంతో మృతదేహాన్ని గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్మికుడు విధులు నిర్వహించే సదరు కాంట్రాక్టర్‌తో కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు పరిహారం చెల్లింపు విషయం చర్చలు కొనసాగుతున్నాయి. మృతుడి కుమారుడు రాహుల్ సునాని ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై–2 మానస ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు విచారణ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

**• వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం**

**రామగుండం:** అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మండల విద్యాధికారి ఏకాంబరం ప్రారంభించారు.

**• సమ్మర్ క్యాంపు వినియోగించుకోండి**

**రామగుండం:** ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో జూన్ 10వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకోవాలని రామగుండం మండల విద్యాధికారి చంద్రయ్య కోరారు. శుక్రవారం రామగుండం మండల విద్యావనరుల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**• బుద్ధ జయంతి ఉత్సవ కమిటీ నియామకం**

**ఎలిగేడు:** మండలంలోని ధూళికట్ట బౌద్ధ స్తూపం వద్ద 12న బుద్ధ జయంతి నిర్వహించేందుకు బుద్ధ జయంతి కమిటీని నియమించినట్లు జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ దేవ శ్రీనివాస్ తెలిపారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ బాలుసాని పర్శరాములుగౌడ్, గౌరవ సహాదారులుగా పడాల పర్శరాములుగౌడ్ (మాజీ సర్పంచ్), గొల్లె భూమేశ్ (మాజీ ఎంపీటీసీ), ఇరుగురాల తిరుపతి, ఉపాధ్యక్షులుగా పోల్సాని పుల్లారావు, అట్టెపల్లి కనుకయ్య, ప్రధాన కార్యదర్శిగా కొక్కిరాల దామోదర్‌రావు, కార్యదర్శిగా మారం కొమురయ్య (మాజీ ఎంపీటీసీ), సభ్యులుగా భూసారపు సురేశ్, భూసారపు తిలక్ గౌడ్, దేవ రాము, దీకొండ తిరుపతి, సుంకనపల్లి రాజయ్యతోపాటు మరో 50మందిని నియమించినట్లు పేర్కొన్నారు.

**• సన్నవడ్ల కాంటాలపై నిర్వాహకుల నిర్లక్ష్యం**

**కాల్వశ్రీరాంపూర్:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లు కాంటాలు వేయకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు.

### వడదెబ్బతో మృతిపై క్షేత్రస్థాయి విచారణ


క్షేత్రస్థాయి విచారణ చేపడుతున్న మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని మొగల్‌పహాడ్‌లో మృతి చెందిన చిలుక రాజయ్య అనే వ్యక్తి మృతిపై జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శుక్రవారం అంతర్గాం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు సదరు వ్యక్తి ఎలాంటి వడదెబ్బకు గురికాలేదని నిర్ధారణకు వచ్చారు. వడదెబ్బకు గురైనట్లు భావిస్తే సమీప ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేయనున్నట్లు మెడికల్ ఆఫీసర్ పేర్కొన్నారు. విచారణలో స్థానిక ఏఎన్‌ఎం దువ్వాసి ఉమాదేవి, ఆశావర్కర్ చిలుక పద్మ ఉన్నారు.

### సమ్మె నోటీసు అందజేత

**పాలకుర్తి:** బసంత్‌నగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథికి శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మె నేపథ్యంలో సంబంధిత నోటీసును కలెక్టర్, జిల్లా లేబర్ అధికారికి అందజేశామని తెలిపారు. దీనిలో భాగంగానే సంబంధిత ప్రతిని కేశోరాం అధికారులకు కూడా అందజేసినట్లు నాయకులు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు భూమల చందర్, ఉపాధ్యక్షుడు మేకల సతీశ్, ప్రధాన కార్యదర్శి సమ్మిరెడ్డి, సీఐటీయూ నాయకులు ముత్యంరావు ఉన్నారు.

### కులగణనతో దేశానికి సామాజిక అభివృద్ధి


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

**గోదావరిఖని:** దేశవ్యాప్తంగా జనగణనతో పాటే కులగణన చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాలకంటే సామాజిక అభివృద్ధికే పెద్దపీట ఉంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పిడుగు కృష్ణ, మేర్గు హన్మంత్‌గౌడ్, కోమల మహేశ్, జక్కుల నరహరి, మచ్చ విశ్వాస్, కోడూరు రమేశ్, గుండబోయిన భూమయ్య, మిట్టపల్లి సతీశ్‌కుమార్, బోడకుంట సుభాష్ పాల్గొన్నారు.

## సింగరేణి వార్తలు

# ఆర్జీ–1 ఏరియాలో 51శాతం బొగ్గు ఉత్పత్తి


మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

**గోదావరిఖని:** ఆర్జీ–1 ఏరియాలో ఏప్రిల్‌లో 51శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం లలిత్ కుమార్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలలో 4.06లక్షల టన్నుల లక్ష్యానికిగాను 2.06లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. బొగ్గు నిల్వలు ఎక్కువగా ఉండడంతో ఉత్పత్తి తగ్గిందని, రవాణా మాత్రం 4.48లక్షల టన్నులు జరిగిందన్నారు. త్వరలో నిరుద్యోగుల కోసం కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు పేర్లను వీటీసీలో అందజేయాలని సూచించారు. సీఅండ్‌ఎండీ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కోర్సులను నిరంతరం కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క–సాలరమ్మ గద్దెల వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. మరో మూడునెలల్లో సింగరేణి ఏరియా ఆసుపత్రిలో క్యాథ్‌లాబ్ పనులు పూర్తి కానున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఐఈడీ డీజీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అకాడమీ డైరెక్టర్ అశోక్‌కుమార్

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం టెక్నోస్పార్క్ 2క25 కార్యక్రమ బ్రోచర్‌ను శుక్రవారం కాలేజీ అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశ్ ఆవిష్కరించారు. ఈ నెల 6న నిర్వహించే కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర, ఉమ్మడి జిల్లాలోని కాలేజీల విద్యార్థులు హాజరై ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, జస్ట్ మినిట్, థీమ్‌డాన్స్, షార్ట్‌ఫిలిం, ఫన్ గేమ్స్, సింగింగ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, రీల్స్, స్టాండప్ కామెడీ లాంటి కార్యక్రమాలు రూపొందిస్తారన్నారు. గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఏవో సురేశ్, రాజిరెడ్డి, హెచ్‌వోడీలు నటరాజన్, స్వాతి, ప్రభాకర్, ఆరిఫ్, పద్మిని, వంశీ, చందు ఉన్నారు.

### క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్


క్రీడాకారులతో రవీందర్

**సుల్తానాబాద్:** క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్ అని స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కీడల్లో రాణించాలని సూచించారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులందరికీ జిల్లా క్రీడా యువజనశాఖ ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. సీనియర్ క్రీడాకారులు అమిరిశెట్టి తిరుపతి, ముస్తఫా, జిలాని, కోచ్ ప్రవీణ్, దేవేందర్ పాల్గొన్నారు.


రామగుండం: ఆదర్శ విద్యార్థులు


ఎలిగేడు: సన్మానిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎంలు

### విద్యార్థులకు సన్మానం

**రామగుండం:** ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ ఆదర్శ (మోడల్) విద్యాలయం విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ పంబాల సదానందం యాదవ్ నేతృత్వంలో శుక్రవారం అభినందించారు. అనంతరం వారి పేరెంట్స్‌ను కూడా అభినందించారు. టీచర్లు జె.శ్రీనివాస్, ఎం.రాజ్‌కుమార్ ఉన్నారు.

**ఎలిగేడు:** ఎలిగేడు ఉన్నత పాఠశాలకు చెందిన కోడూరి సాహిత్య 549మార్కులు, సుల్తాన్‌పూర్ పాఠశాలకు చెందిన ప్రణవి 516మార్కులు సాధించారు. వీరిని శుక్రవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో నరేంద్రచారి, హెచ్‌ఎం దేవేందర్‌రావు సన్మానించారు.


జూలపల్లి: విద్యార్థులకు సన్మానం

**జూలపల్లి:** మండలంలో ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ సన్మానించారు. పదో తరగతిలో మండల స్థాయిలో టాపర్‌గా నిలిచిన స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి అశ్వితను ఎంఈవో సరస్వతి, హెచ్‌ఎం లక్ష్మణ్ సన్మానించారు.

### నేత్ర, అవయవదానానికి దంపతుల అంగీకారం


అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

**కోల్‌సిటీ:** గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన సింగరేణి కాంట్రాక్టర్ కట్ల లక్ష్మీనారాయణ, ఆయన భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కట్ల స్వరూప దంపతులు శుక్రవారం స్ఫూర్తిదాయక నిర్ణయం తీసుకున్నారు. వారి కూతురు శ్రీమేధ పుట్టినరోజు సందర్భంగా మరణానంతరం తమ నేత్రాలు, అవయవాలు దానం చేస్తామని దంపతులు అంగీకారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారి నివాసంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో, గోదావరిఖని ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ల శ్యామ్‌సుందర్, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాసుకు దంపతులు అంగీకార పత్రాలను అందజేశారు. అనంతరం దంపతులకు అభినందన పత్రం అందజేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు తాడబోయిన రాములు, సరోజన, మగువ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షురాలు శశికళ, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నాగుల శంకర్, సుందర్, దబ్బటి శంకర్, కుటుంబ సభ్యులు సమ్మక్క, చంద్రశేఖర్, స్రవంతి, సాహితీ, ప్రవీణ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

### శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

**ఎలిగేడు:** మండలంలోని ముప్పిరితోటలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి తిరుక్కళ్యాణోత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఆలయంలో భగవద్రామానుజుల వారి తిరునక్షత్రోత్సవం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈనెల 14న స్వామివారి రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. భాగవతచరణురేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్‌రెడి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కొండపాక రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.